సాక్షి
నిజామాబాద్

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



క్రీడాకారులను ప్రోత్సహించడం..
నగరంలో నిర్వహిస్తున్న డీఎస్ స్మారక టోర్నీ ముగిసింది. విజేతలకు బహుమతులు అందజేశారు.
- 10లో ▸



తాగునీటి సమస్యకు పరిష్కారం
తాగునీటి సమస్య తలెత్తితే తక్షణం పరిష్కరించే విధంగా నీటి సహాయకులకు అధికారులు శిక్షణ ఇస్తున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /22.8

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి చలిగా ఉంటుంది.

గాడి తప్పిన పాలన



- తెలంగాణ వర్సిటీలో కనిపించని అకడమిక్ వాతావరణం
- అడుగడుగునా గ్రూపు రాజకీయాలు
- పరిశోధనల ఊసే లేదు
- పేరుకే బయోమెట్రిక్ అటెండెన్స్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ యూనివర్శిటీలో పాలన గాడి తప్పింది. గతంలో పనిచేసిన వీసీ రవీందర్ గుప్తా ఏసీబీకి చిక్కారు. 2023 జూన్‌లో ఒక కళాశాల యాజమాన్యం నుంచి లంచం తీసుకున్న కేసులో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి అరెస్టయిన వెంటనే పాలకమండలి ప్రొఫెసర్ యాదగిరిని రిజిస్ట్రార్‌గా కూర్చొబెట్టింది. ఆ సమయంలో అక్రమాలకు కేరాఫ్‌గా ఉన్న ఒక ప్రొఫెసర్ యాదగిరిని రిజిస్ట్రార్ కుర్చీ నుంచి తప్పించేందుకు ప్రయత్నించడంతో.. అప్పటి పాలకమండలి మాత్రం పాలన గాడి తప్పొద్దని యాదగిరికి వెన్నుదన్నుగా నిలిచింది. 2024 ఫిబ్రవరిలో పాలకమండలి గడువు ముగియడంతో వర్సిటీలో పాలన పూర్తిగా గాడి తప్పింది. ఏడు నెలల కాలంలో ఇద్దరు ఇన్‌చార్జి వీసీలు మారినప్పటికీ ఒక్కరు కూడా యూనివర్సిటీ వైపు వచ్చింది లేదు. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఒకసారి ఆదివారం వచ్చారు. ఆయన వచ్చిన విషయాన్ని కూడా రిజిస్ట్రార్ గోప్యంగా ఉంచడం గమనార్హం.

నోటిఫికేషన్ల ఊసే లేదు

యూనివర్శిటీకి న్యాక్ గుర్తింపు లేకపోవడంతో సొంతంగా పీహెచ్‌డీ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం లేదు. నెట్, సెట్ ద్వారా మాత్రమే ప్రవేశాలు జరగాలి. పలువురు అభ్యర్థులు ఇప్పటికే నెట్, సెట్ ద్వారా అర్హత సాధించి ఉత్తీర్ణత సాధించి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పలు విద్యార్థి సంఘాలు ఈ విషయమై వినతిపత్రాలు ఇచ్చాయి. అయినప్పటికీ ఇవేమీ పట్టనట్లు రిజిస్ట్రార్ వ్యవహరిస్తుండడం గమనార్హం.

రిజిస్ట్రార్ చేస్తున్నదేమిటి

రిజిస్ట్రార్ అధ్యాపకుల మధ్య విభేదాలు పెంచి పోషిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. న్యాయబద్ధంగా పదోన్నతులు రావాల్సిన వారిని వదిలి వివాదాస్పద 2014 అభ్యర్థుల కోసం న్యాయవాదుల దగ్గరికి, ఉన్నతాధికారుల దగ్గరకు చక్కర్లు కొడుతుండడం విశేషం. లీగల్ ఒపీనియన్ పేరుతో ఈసీ అనుమతులు లేకుండా రూ.2లక్షలు న్యాయ వాది ఫీజుగా చెల్లించి ఉన్నత విద్యకు సంబంధించిన న్యాయ నిపుణుల ద్వారా కాకుండా మరో విభాగం న్యాయ నిపుణుల ద్వారా సానుకూలంగా రిపోర్ట్ తెప్పించడం విశేషం. వీలు దొరికినప్పుడల్లా 2014 అభ్యర్థులతో సమావేశమై, వాళ్ల పదోన్నతుల కోసం మార్గాన్వేషణ చేస్తున్నట్లు తెలుస్తోంది. గత వీసీ హయాంలో కొనుగోళ్లు జరిపిన వాటిలో ఒప్పందం కుదిరిన సంస్థలకు బిల్లులు చెల్లిస్తున్నారు. తనకు నచ్చని సంస్థల బిల్లుల చెల్లింపు పెండింగ్‌లో ఉంచుతున్నారు. సిబ్బంది పనితీరుపై సమీక్షలకు దూరంగా ఉంటున్నారు. ప్రస్తుతం ఒక వర్గం వాళ్లకు పదోన్నతులు ఇప్పించేందుకు సమయం కేటాయిస్తున్నారంటూ వర్సిటీలో చర్చ జరుగుతోంది. ఈ విషయాలపై వివరణ కోసం ఇన్‌చార్జి వీసీ సందీప్ సుల్తానియాకు ఫోన్ చేయగా స్పందించలేదు.

సమయపాలన పాటించని సిబ్బంది

విశ్వవిద్యాలయం అంటేనే అధ్యయనం, పరిశోధన. కానీ తెయూలో ఆ వాతావరణమే కనిపించని దుస్థితి నెలకొంది. బోధన, బోధనేతర సిబ్బంది ఎవరూ కూడా సమయపాలన పాటించడం లేదు. అటు బయోమెట్రిక్ విధానం కానీ, ఇటు రిజిస్టర్ విధానాన్ని కానీ పాటించడం లేదు. దాదాపు పది మంది బోధన సిబ్బంది హైదరాబాద్ నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. మరో ఇద్దరు ముగ్గురు మాత్రం నెలకు ఒక్కసారి వస్తే గొప్ప అనే పరిస్థితి. వీరిలో రిజిస్ట్రార్ యాదగిరి సన్నిహితులున్నట్లు వర్సిటీలో చర్చ నడుస్తోంది. ఏ ఒక్క విభాగంలో తరగతి గది వాతావరణం కనిపించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. తరగతి గదికి అధ్యాపకులు, విద్యార్థులు దూరమయ్యారు. ఇక పరిశోధనల ఊసే లేదు. ఏమాత్రం ప్రమాణాలు లేని పరిశోధనలు జరుగుతున్నాయనే అపవాదును వర్సిటీ మూటగట్టుకుంది. గతంలో కొన్ని పీహెచ్‌డీ పట్టాలపై విచారణకు పాలకమండలి ఆదేశించినప్పటికీ రిజిస్ట్రార్ పట్టింపు లేకుండా వ్యవహరిస్తుండడం గమనార్హం.

రిజిస్ట్రార్ కార్యాలయంలో హంగామా

ఒక వర్గానికి చెందిన అధ్యాపకులే రిజిస్ట్రార్‌ను నడిపిస్తున్నట్లు వర్సిటీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. వివాదాస్పద 2014 నియామకాల అభ్యర్థులు కొందరు ఈ నెల 25న రిజిస్ట్రార్ కార్యాలయంలో నానా హంగామా చేశారు. ఒకరిద్దరు ఏకంగా రిజిస్ట్రార్‌పై పరుష పదజాలం వాడినట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ఛాంబర్‌లో బల్లలు గుద్దుతూ పరుష పదజాలం వాడినట్లు తెలిసింది. వర్సిటీలో ఇది కొత్త ఏమీ కాదు. గతంలో ఇదే రిజిస్ట్రార్ ఎదుట సౌత్ క్యాంపస్‌లో పనిచేస్తున్న అధ్యాపకులు తమ వేతనాల్లో కోత పెడితే సహించేది లేదంటూ ఇదేరీతిలో ప్రవర్తించిన విషయం తెలిసిందే. గతంలో నోటిఫికేషన్ లేకున్నా తనకు తానుగా ప్రమోషన్ ఇచ్చుకున్న ఒక ప్రొఫెసర్ ఏకంగా రిజిస్ట్రార్‌ని అంతు చూస్తా అని హెచ్చరించినట్లు తెలిసింది. నోటిఫికేషన్, అర్హత లేకున్నా సొంతంగా ఇచ్చుకున్న పదోన్నతి చెల్లదని పాలకమండలి ఆయన ప్రమోషన్‌ను రద్దు చేసింది. ఇదే అంశంపై సదరు ప్రొఫెసర్ కోర్టును తప్పుదారి పట్టించి ఆర్డర్ తెచ్చుకుని నానా యాగీ చేస్తుండడం విశేషం.



ఇందూరులో సినీ తారల సందడి

నగరంలో సినీ తారలు సందడి చేశారు. శుక్రవారం సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి సినీ హీరో రాము పోతినేని, హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ హాజరయ్యారు. వారిని చూడటానికి ప్రజలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పాయల్ తన స్టెప్పులతో అభిమానులను అలరించారు. – నిజామాబాద్ రూరల్

డీఎస్ సేవలు మరువలేనివి

- నివాళులర్పించిన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ రూరల్: మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ రాష్ట్రానికి చేసిన సేవలు మరువలేనివని ఎంపీ అర్వింద్ అన్నారు. డీఎస్ జయంతి సందర్భంగా కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులోని ఆయన సమాధి వద్ద ఎంపీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ నివాళులు అర్పించారు. ఎంపీ మాట్లాడుతూ... తన తండ్రి డీఎస్ తనకు రాజకీయ గురువుగా క్రమశిక్షణ నేర్పారన్నారు. అనంతరం ఎంపీ తిరుపతి లడ్డూ వివాదంపై స్పందించారు. ఈ అంశంలో కేంద్రం సైతం సీరియస్‌గా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సనాతన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయే అన్నారు. ఈ కార్యక్రమంలో బస్వా లక్ష్మీనర్సయ్య, పల్లె గంగారెడ్డి, కాపర్తి శ్రావణ్‌కుమార్, మల్లికార్జున్ రెడ్డి, స్రవంతిరెడ్డి, కోటపాటి నర్సింహానాయుడు, శంకర్, బంటు రాము పాల్గొన్నారు.


డీఎస్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ నాయకులు

న్యూస్‌రీల్

జిల్లా సమాఖ్య పనితీరు భేష్



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా సమాఖ్య పనితీరు బాగుందని, 2023–24 సంవత్సరంలో రూ.37లక్షల లాభాన్ని చేకూర్చడం అభినందనీయమని డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో జిల్లా సమాఖ్య 8వ వార్షిక సమావేశం నిర్వహించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ గతేడాది ఆడిట్ నివేదికను చదివి వినిపించగా సభ్యులు ఆమోదించారు. డీఆర్‌డీవో మాట్లాడుతూ... ఈ ఏడాది స్త్రీనిధి రుణాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం రావడం జిల్లాకు గర్వకారణమన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇంకా మెరుగైన పనితీరుతో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అర్హులైన ప్రతి మహిళను సంఘంలో చేర్పించి వారికి స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలతో ఆర్థిక చేయుతనివ్వాలన్నారు. అదనపు డీఆర్‌డీవో రవీందర్, డీపీఎంలు శ్రీనివాస్, సాయిలు, సంధ్యారాణి, నీలిమా, మారుతి, రాచయ్య, స్త్రీనిధి ఆర్‌ఎం రాందాస్, ఐబీ ఏపీఎం సరోజిని, జిల్లా సమాఖ్య కోశాధికారి లక్ష్మి పాల్గొన్నారు.

నేడు రేబిస్ టీకాల పంపిణీ

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు శనివారం ఉచితంగా రేబిస్ టీకాలు వేయనున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి జిల్లా పశు వైద్యశాలతో పాటు మున్సిపల్, మండల పశు వైద్యశాలల్లో టీకాలు వేస్తామన్నారు. పెంపుడు జంతువుల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీసీ సాధికారత సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఆకుల లలిత



నిజామాబాద్‌నాగారం: బీసీ సాధికారత సంఘం రాష్ట్ర మహిళా గౌరవ అధ్యక్షురాలిగా ఆకుల లలిత నియామకం అయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లో బీసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు గడల శ్రీనివాస్‌రావు, ప్రతినిధులు కొండ దేవయ్యపటేల్, రాష్ట్ర బీసీ కౌన్సిల్ చైర్మన్ కొవ్వూరి భాస్కర్‌రావు సమక్షంలో లలితను నియమించారు. ఆమె మాట్లాడుతూ త్వరలో బీసీ సాధికారత మహిళా రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కాసారం రమేష్, ప్రసాద్‌రావు, ఈసంపల్లి వెంకన్న, వేముల తిరుమలదేవి, వేముల లక్ష్మణ్, ఆర్మీ మహేందర్ కుమార్, చలపతిరావు ఉన్నారు.

30న జిల్లాకు ఎక్సైజ్ మంత్రి రాక

ఖలీల్‌వాడి: ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. మోర్తాడ్, భీమ్‌గల్‌లో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ శాఖ కార్యాలయాలను ఆయన ప్రారంభించనున్నారు.

విద్యుత్ శాఖలో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

సుభాష్‌నగర్: ఎన్‌పీడీసీఎల్‌లో బదిలీలకు విద్యుత్ శాఖ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు మార్గదర్శకాలను శుక్రవారం సీఎండీ వరుణ్‌రెడ్డి జారీ చేశారు. అక్టోబర్ 7లోపు బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని, బదిలీ అయిన వారు 9వ తేదీలోపు ఆయా స్థానాల్లో చేరాలని ఆదేశించారు. 2024 జూన్ 30 వరకు రెండేళ్లు పూర్తి చేసుకున్న 50శాతం ఉద్యోగులను బదిలీ చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. సబ్ ఇంజినీర్, ఏఈ, ఏడీఈ, డీఈ, అకౌంట్స్ ఆఫీసర్, ఎస్‌ఏవో, ఏవో, జేఏవో, ఫోర్‌మెన్, ఎస్‌ఎల్‌ఐ స్థాయి ఉద్యోగులకు బదిలీ ప్రక్రియ జరగనుంది. క్షేత్ర స్థాయి సిబ్బందికి డీఈలు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీలు చేపట్టనున్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉద్యోగులు ఆప్షన్లు పెట్టుకోవాలి.

మార్గదర్శకాలు..

- ఈ నెల 28న ఆన్‌లైన్‌లో బదిలీకు అర్హత ఉన్న ఉద్యోగుల జాబితా ప్రదర్శన.
- 30న ఉద్యోగుల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ.
- అక్టోబర్ 4వరకు బదిలీల దరఖాస్తులు చేసుకోవాలి.
- 7న బదిలీ ఉత్తర్వులు వెలువడుతాయి.
- 9వ తేదీవరకు బదిలీ అయిన ఉద్యోగులు కొత్త స్థానాల్లో చేరాలి.

సన్నరకాల నిర్ధారణ బాధ్యత మాకొద్దు

- వ్యవసాయ అధికారులే గుర్తించేలా ప్రభుత్వానికి విన్నవించాలి
- ఐడీసీఎంఎస్ మహాజన సభలో సొసైటీ చైర్మన్లు

సుభాష్‌నగర్: ప్రభుత్వం సన్నరకం ధాన్యంలో ఎంపిక చేసిన వాటికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో ధాన్యం నిర్ధారణ బాధ్యతలు సొసైటీలకు అప్పగించవద్దని చైర్మన్లు డీసీఎంఎస్ మహాజన సభ దృష్టికి తెచ్చారు. సన్నరకాల నిర్ధారణ బాధ్యతను వ్యవసాయశాఖ అధికారులకు అప్పగించాలని ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. శుక్రవారం నగరంలోని ఐడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ తారాచంద్ నాయక్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి హాజరయ్యారు. ఏప్రిల్ 2024 నుంచి ఆగస్టు 2024 వరకు వ్యాపారం, క్రయ విక్రయాలు తదితర విషయాలను సభ్యులకు వివరించగా ఆమోదిస్తూ తీర్మానించారు. అయితే సన్నరకా నిర్ధారణ బాధ్యతలు సొసైటీలకు అప్పగిస్తే రైతుల్లో చెడ్డ పేరు వస్తుందని చైర్మన్లు మహాజన సభలో ఆందోళన వ్యక్తంచేశారు. పదవీ కాలం ముగిసే సమయంలో చెడ్డ పేరు తమకొద్దని చైర్మన్లు సభకు విన్నవించారు. అలాగే ఈ సీజన్‌లో సన్నరకాలకు దోమపోటు వచ్చిందని, దీంతో అధికంగా వచ్చే అవకాశముందని చైర్మన్లు పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని రైస్‌మిల్లర్లు తరుగును ఐదారు కిలోలపైనే తీసే ఆస్కారముంటుందని, ఈవిషయంలోనూ రైస్‌మిల్లర్లతో ఏదో ఒకటి తేల్చుకోవాలని కోరినట్లు తెలిసింది. తరుగుతో రైతుల వద్ద తాము తరచూ బదనాం అవుతున్నామని చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. రుణమాఫీ విషయంలోనూ సాంకేతిక లోపాల కారణంగా కొంతమందికి కాలేదని చైర్మన్లు సభ దృష్టికి తీసుకురాగా, త్వరలోనే పరిష్కరిస్తామని డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. రూ.2 లక్షలు ఖాతాల్లో జమ చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఆపైన మొత్తం ఉన్న వారు చెల్లించాలనడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చైర్మన్లు సభ దృష్టికి తెచ్చారు. ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను ప్రస్తావించగా.. సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని ఐడీసీఎంఎస్ చైర్మన్ పేర్కొన్నారు. ఐడీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఏడుళ్ల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు పి సాయన్న, శ్రీనివాస్ గౌడ్, కపిల్‌రెడ్డి, రాజేశ్వర్, రాజాగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్

మిల్లర్లకు మిగిలింది రెండ్రోజులే..

- ఈనెల 30తో ముగియనున్న సీఎంఆర్ గడువు
- ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం 63,914 మెట్రిక్ టన్నులు
- 19 రైస్‌మిల్లులకు నోటీసులు
- 14 మందిపై క్రిమినల్, ఆర్ఆర్ యాక్టు కేసులు

సుభాష్‌నగర్: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. వారు బియ్యం ఇవ్వని పక్షంలో పెనాల్టీ, వడ్డీ సహా డబ్బులు చెల్లించాలని ఆదేశించింది. ఆ గడువు కూడా మరో రెండ్రోజులే మిగిలి ఉంది. ఇంకా జిల్లాలో 33 మంది రైస్‌మిల్లర్లు సుమారు రూ.100 కోట్లకుపైనే విలువైన బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఆ మేరకు పౌరసరఫరాల సంస్థ అధికారులు 19 మంది రైస్‌మిల్లులకు నోటీసులు ఇవ్వగా, మరో 14 మంది రైస్‌మిల్లర్లపై క్రిమినల్, ఆర్ఆర్ యాక్టు కింద కేసులు నమోదు చేశారు. ఈనెల 30 వరకు బియ్యం చెల్లించని పక్షంలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశించినట్లు తెలిసింది.

జిల్లాలో 324 రైస్‌మిల్లులు ఉన్నాయి. 2019–20 యాసంగి నుంచి 2022–23 వానాకాలం సీజన్ వరకు ధాన్యం దించుకున్న మిల్లర్లందరూ సీఎంఆర్ ఇచ్చేయాలని సెప్టెంబర్ 30, 2024 వరకు ప్రభుత్వం గడువు విధించింది. ఈమేరకు సీఎంఆర్ ఇవ్వని 39 మంది రైస్‌మిల్లర్లకు నోటీసులిచ్చింది. అందులో ఆరుగురు మిల్లర్లు క్లియర్ చేయగా, మరో 33 మంది 63,914 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. అందులో 14 మందిపై క్రిమినల్, ఆర్ఆర్ యాక్టు కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే వారందరినీ డిఫాల్టర్లుగా పరిగణిస్తున్నారు.



గడువు పెంపు లేనట్లే!

సీఎంఆర్ ఇవ్వని రైస్‌మిల్లర్లకు మరోసారి గడువు పెంచేందుకు ప్రభుత్వం విముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈనెల 30 వరకు గడువు ఉండగా ప్రభుత్వం మరో నెలరోజులు పెంచుతుందనే ధీమాలో రైస్‌మిల్లర్లు ఉన్నట్లు సమాచారం. ఆ ధీమాతోనే బియ్యం, నగదు ఇచ్చి క్లియర్ చేసేందుకు ముందుకు రావడం లేదని తెలిసింది. డిఫాల్టర్లుగా గుర్తించిన రైస్‌మిల్లులకు ఈసారి ధాన్యం కేటాయించకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది.

ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తాం



ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో ధాన్యం దించుకుని సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు 39 మందికి నోటీసులివ్వగా, ఆరుగురు క్లియర్ చేశారు. మరో రెండ్రోజులు గడువు ఉంది. ఎవరైనా మిల్లర్లు వచ్చి క్లియర్ చేసుకుంటారేమోనని వేచి చూస్తున్నాం. అలా రాని పక్షంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. – వైపీ రమేశ్, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

- క్షేత్రస్థాయిలో మరింత పట్టు సాధించేందుకు ఇరు పార్టీల యత్నాలు
- స్థానిక ఎన్నికల్లో విజయబావుటా ఎగరేసేందుకు బూత్ స్థాయిలో కృషి
- మరోవైపు అడ్రస్ లేని బీఆర్ఎస్ నాయకులు
- నైరాశ్యంలో గులాబీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య నువ్వా నేనా అనేలా పరిస్థితి మారింది. నవంబర్ వరకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హవా అన్ని స్థాయిల్లో ఏకపక్షంగా నడిచింది. అయితే అధికారం కోల్పోయాక మాత్రం జిల్లాలో రాజకీయ స్థితిగతులు పూర్తిగా మారిపోయాయి. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే పరస్పర కౌంటర్ స్టేట్‌మెంట్లు ఇచ్చుకుంటూ ముఖాముఖి తలపడుతున్నాయి. ప్రతి అంశంపై ఈ రెండు పార్టీలే మాటలయుద్ధం చేస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ నాయకులు మాత్రం పత్తా లేకుండా పోయారు. కేసీఆర్, కేటీఆర్ నుంచి పిలుపు వచ్చినప్పుడు మాత్రమే క్షేత్రస్థాయికి వచ్చి స్పందిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్‌కు సంబంధించి తృతీయ శ్రేణి నాయకులు మాత్రమే అప్పుడప్పుడూ స్పందిస్తున్నారు తప్ప ముఖ్య నాయకులు మాత్రం కనిపించడం లేదు.

- కాంగ్రెస్ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయబావుటా ఎగరవేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిల ఆధ్వర్యంలో శ్రేణులు సిద్ధమవుతున్నాయి. మరోవైపు బీజేపీ సైతం జిల్లా ప్రజాపరిషత్‌తో పాటు సాధ్యమైనన్ని మండల ప్రజాపరిషత్‌లను కైవసం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది. కీలకమైన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గెలుపొందేందుకు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకుంటున్నారు. అదేవిధంగా పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సైతం పావులు కదుపుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు మాత్రం అంతగా కనిపించడం లేదు.



- అధికారం కోల్పోయాక జిల్లాలో బీఆర్ఎస్ కార్యకలాపాలు దాదాపు లేవనే చెప్పాలి. అధినాయకత్వం పిలుపునిచ్చినప్పుడు మాత్రమే తూతూమంత్రంగా ప్రజాసమస్యలపై కార్యక్రమాలు చేసి వెళుతున్నారు. బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గానికి మాత్రమే పరిమితమవుతున్నారు. మాజీ మంత్రి అయి ఉండి కూడా జిల్లాలోని ఇతర నియోజకవర్గాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇక జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి రెండుమూడు సార్లు మినహా జిల్లాలోనే కనిపించలేదు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎవరనే విషయమే ప్రజలకు గుర్తులేకుండా పోయిందని పలువురు వ్యాఖ్యలు చేస్తుండడం గమనార్హం.

- నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా సైతం పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు చేసే విషయంలో ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కార్యకర్తలు నిరుత్సాహానికి గురవుతున్నారు. మరోవైపు బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అమేర్ అసలు దేశంలోనే లేకపోవడం విశేషం. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు దిక్కు దివానం లేకుండా పోయింది. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో అక్కడ బీఆర్ఎస్ పరిస్థితి దయనీయంగా ఉంది. మరోవైపు మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత జైలు నుంచి బయటకు వచ్చినప్పటికీ ఇప్పటి వరకు జిల్లాకు రాలేదు. అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో హడావుడి చేసిన బీఆర్ఎస్ నాయకులెవ్వరూ ఇప్పుడు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ఆ పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో నైరాశ్యం అలుముకుంది.

క్లుప్తంగా

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



నిజామాబాద్అర్బన్: తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి ఉత్సవాలు చేపట్టారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మేయర్ నీతూ కిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బీసీ పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు వినాయక నగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమేశ్, నర్సయ్య, పులగం హనుమాండ్లు, బిజ్జు దత్తాద్రి, గుజ్జ రాజేశ్వరి, వెంకట నర్సయ్య, మురళి, గురుచరణం, చంద్రభాగ, పి నర్సయ్య, బంగారు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

30న ఉమ్మడి జిల్లా త్రైక్వాండో ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 విభాగంలో బాలబాలికలకు త్రైక్వాండో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఈ నెల 30న నగరంలోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో ఉంటాయని క్రీడల కార్యదర్శి నాగమణి శుక్రవారం పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7097047036నంబర్‌నుసంప్రదించాలన్నారు.

అక్టోబర్ 1న జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 విభాగంలో బాలబాలికలకు ఖోఖో జిల్లాస్థాయి పోటీలు అక్టోబర్ 1న నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఉంటాయని క్రీడల కార్యదర్శి నాగమణి పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9347216426నంబర్‌నుసంప్రదించాలన్నారు.

కంజర్‌లో పోలీస్ పికెట్

మోపాల్: మండలంలోని కంజర్‌లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా ఎస్‌హెచ్‌వో యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్ శుక్రవారం కొనసాగింది. గ్రామంలో బుధవారం రాత్రి గాజ నరహరిని మాజీ సర్పంచ్ బోయిని లలిత సత్యనారాయణ కుటుంబీకులు హత్య చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో గ్రామంలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పకుండా ఉండేందుకు పోలీసులు పికెట్ ఏర్పాటు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



భూమవ్వ(ఫైల్)

తాడ్వాయి: మండలంలోని ఎండ్రియాల్ గ్రామానికి చెందిన గడ్డం భూమవ్వ(119)అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూమవ్వకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె భర్త 30 ఏళ్ల క్రితం మృతి చెందాడు. నాటి నుంచి కూలీ పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలిచింది. కొంత కాలంలో అనారోగ్యంతో బాధపడుతుండగా ఉదయం మృతి చెందింది. స్వాతంత్ర్య సమరం జరిగినప్పుడు భూమవ్వ కండ్లార చూసిందని గ్రామస్తులు తెలిపారు.

తాగు నీటి సమస్యకు పరిష్కారం

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలు



రెంజల్‌లో నీటి సహాయకులకు శిక్షణ అందిస్తున్న అధికారులు

రెంజల్: ఉమ్మడి జిల్లాలో తాగు నీటి సమస్యను సత్వరం పరిష్కరించేందుకు కసరత్తు నడుస్తోంది. ఈ మేరకు నీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమాలను అందిస్తున్నారు. అక్టోబర్ నెల చివరి వరకు శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేసి వేసవిలో తాగు నీటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ గ్రామానికి ఒక నీటి సహాయకుడిని, మేజర్ జీపీల్లో పంచాయతీ కార్యదర్శుల తీర్మాణం మేరకు ఇద్దరు చొప్పున ఎంపిక చేసి శిక్షణ అందిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఏ చిన్న తాగు నీటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో కార్యక్రమానికి రూపకల్పన చేస్తున్నారు. పైప్ లైన్ లీకేజీలు, బోర్లు, మోటార్లు మొరాయించినప్పుడు వెంటనే మరమ్మతులు పూర్తి చేయించేలా మంచి నీటి సహాయకులకు శిక్షణ అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నల్ జల్ మిత్ర' పథకంలో భాగంగా రాష్ట్ర మిషన్ భగీరథ ఆధ్వర్యంలో పథకానికి రూపకల్పన చేసింది.

1220 మందికి శిక్షణ

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ అధికారులు ఉమ్మడి జిల్లాలో 1220 మంది నీటి సహాయకులను ఎంపిక చేసి శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం జీపీల్లో పనిచేస్తున్న వాటర్‌మన్‌లతో పాటు కనీసం 5వ తరగతి వరకు చదువుకున్న వారిని గుర్తించి గ్రామ సహాయకులుగా గుర్తించారు. వీరు పైప్‌లైన్ లీకేజీలను అరికట్టడం, మోటర్ల మరమ్మతులు, నీటి నాణ్యతను గుర్తించడం, ట్యాంకులను శుభ్రం చేయడం చేయాల్సి ఉంటుంది. అవసరమైన ఖర్చులను పంచాయతీ నిధుల నుంచి వెచ్చించాల్సి ఉంటుంది. మిషన్ భగీరథ నుంచి కొంత మంది అధికారులను ట్రెయినీలుగా నియమించి వారి ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తున్నారు. అక్టోబర్ నెల తర్వాత వీరు క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉంటుంది.

> **వచ్చే నెల చివరి వరకు శిక్షణ**
> ఉమ్మడి జిల్లాలో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అక్టోబర్ నెల చివరి వరకు పూర్తి చేస్తాం. గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బందులు రాకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. నిజామాబాద్ జిల్లాలో 645, కామారెడ్డి జిల్లాలో 575 మంది సహాయకులకు శిక్షణ అందిస్తున్నాం.
> – రాజేంద్రకుమార్, మిషన్ భగీరథ ఎస్ఈ

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మేయర్ నీతూకిరణ్, మాల్ నిర్వాహకులు

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మేయర్ నీతూకిరణ్ శుక్రవారం ప్రారంభించారు. ప్రజలకు అందుబాటు ధరల్లో అందిస్తున్న సీఎంఆర్ షాపింగ్ మాల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సినీ నటి పాయల్‌రాజ్‌పుత్, హీరో రామ్ పోతినేని షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొని సందడి చేశారు. దీంతో అభిమానులు, కొనుగోలుదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సినీ నటి పాయల్‌రాజ్‌పుత్ పలు వస్త్రాభరణాలను పరిశీలించి, ప్రదర్శించారు. ఈ సందర్భంగా షాపింగ్‌మాల్ ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై సినీ నటి చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది.సినీతారలను చూసేందుకు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ యజమాని వెంకటరమణ, కార్పొరేటర్ హేమలత, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బస్వాలక్ష్మీనర్సయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ హీరో రామ్



డ్యాన్స్ చేస్తున్న సినీ నటి పాయల్

క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం



మాట్లాడుతున్న సినీ హీరో ఆకాశ్ పూరి



విజేత జట్టుకు షీల్డు అందిస్తున్న ధర్మపురి సంజయ్

- ముగిసిన డీఎస్ స్మారక క్రీడాపోటీలు
- కార్యక్రమానికి హాజరైన సినీ హీరో ఆకాశ్ పూరి

నిజామాబాద్‌నాగారం: గ్రామీణ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడానికి డీఎస్ స్మారక టోర్నమెంట్‌ను పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీయమని సినీ హీరో ఆకాశ్ పూరి అన్నారు. ఈ నెల 23 నుంచి 27వరకు మాజీ మంత్రి, ఎంపీ, దివంగత నేత డి శ్రీనివాస్ స్మారక జిల్లాస్థాయి టోర్నమెంట్‌ను నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్ పోటీలు చేపట్టారు. ముగింపు కార్యక్రమానికి ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు పూరిజగన్నాథ్ తనయుడు హీరో ఆకాశ్ పూరి హాజరై మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం మెహెబూబా సినిమాలోని పలు డైలాగ్‌లు చెప్పారు. అనంతరం విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలతో పాటు నగదు పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు డి సాయిలు, వ్యాయామ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణతో వేధింపులు

మాచారెడ్డి: కులాంతర వివాహం చేసుకున్న ఓ యువతికి సంబంధిన ఐదు కుటుంబాలను కుల బహిష్కరణ చేసిన ఘటన మాచారెడ్డి మండల కేంద్రంలో జరిగింది. బాధితులు శుక్రవారం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బంగ్లా రాజేందర్‌గౌడ్ కుమార్తె 2021లో కులాంతర వివాహం చేసుకుంది. నాటి నుంచి రాజేందర్‌గౌడ్‌కు చెందిన ఐదు కుటుంబాలను గౌడ సంఘ ప్రతినిధులు మంచి చెడులకు పిలవకుండా మానసికంగా హింసిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ నెల 23న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమతో మాట్లాడిన వారికి రూ. 50వేల జరిమానా విధిస్తామని సంఘం ప్రతినిధులు హుకుం జారీ చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నేడు లోక్ అదాలత్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి శుక్రవారం పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌కు ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్ సునీతా కుంచాల హాజరవుతారని అన్నారు.

జిల్లా జైలును పరిశీలించిన జడ్జి



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని సారంగపూర్ శివారులో ఉన్న జిల్లా జైలును జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల శుక్రవారం పరిశీలించారు. జిల్లా జైలులోని అన్ని బారక్‌లను పరిశీలించి ఖైదీలతో మాట్లాడి సమస్యలను, మహిళా ఖైదులకు ఉన్న వసతులను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఉన్న నర్సరీని పరిశీలించారు. అలాగే ఖైదీల వివరాల బోర్డు పరిశీలించగా సారంగపూర్ జైలులో 415 మంది ఖైదీలతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నట్లు జైలు సిబ్బంది జడ్జికి వివరించారు. జడ్జి వెంట జిల్లా జైలు అధికారులు ఆనంద్, రాజశేఖర్, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్ ఉన్నారు.

జీజీహెచ్ వంటశాల తనిఖీ



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారి వాసుదేవరావు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రోగులకు, డాక్టర్లకు అందిస్తున్న ఆహారం, నాణ్యతను పరిశీలించారు. వంటశాలలో పాటిస్తున్న శుభ్రత చర్యలపై ఆరాతీశారు. ఇటీవల ఆస్పత్రిపై కథనాలు రావడంతో పాటు ఫిర్యాదులు అందడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది.

తెయూ భూములను కాపాడాలి

తెయూ(డిచ్‌పల్లి): కబ్జాకు గురవుతున్న తెలంగాణ యూనివర్సిటీ భూములను కాపాడాలని పీడీఎస్‌యూ నాయకులు జన్నారపు రాజేశ్వర్, గణేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం యూనివర్సిటీలో వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. గతంలో యూనివర్సిటీ భూములను కబ్జా చేస్తుంటే పీడీఎస్‌యూ పోరాటం చేసిందన్నారు. కోర్టులో కేసు గెలవడానికి కూడా పీడీఎస్‌యూ కృషి చేసిందన్నారు. ఇప్పుడు హైకోర్టులో కేసు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా వర్సిటీ భూములను తమ గుప్పిట్లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీ భూముల జోలికి ఖబర్దార్ అని హెచ్చరించారు. కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న రిజిస్ట్రార్ యాదగిరిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రవీందర్, బిందు, హనుమాండ్లు, వేణు, సాయిబాబా, శివకుమార్, రాజేశ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూమి ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉంటుంది

- తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీకి చెందిన భూమి ప్రభుత్వ పర్యవేక్షణలో ఉంటుందని రిజిస్ట్రార్ యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 578.02 ఎకరాల భూమిని సేకరించి 2007లో తెలంగాణ యూనివర్సిటీకి స్వాధీనం చేశారన్నారు. 2011లో రోజారాణి, సీతల్ టౌన్‌షిప్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 50 ఎకరాలు తమ సొంత భూమి అని జిల్లా కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. 2012లో కోర్టు అది ప్రభుత్వ భూమని తీర్పిచ్చిందన్నారు. వారు హైకోర్టును ఆశ్రయించడంతో 2024 ఏప్రిల్ 2న ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. ఈ భూములను కాపాడాలని కలెక్టర్‌ను కోరుతూ లేఖ అందజేశామన్నారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో సెప్టెంబర్‌లో అధికారులు సర్వే పూర్తి చేశారని తెలిపారు. వర్సిటీ భూములకు సంబంధించిన న్యాయ సంబంధ అంశాలన్ని రెవెన్యూ విభాగ పర్యవేక్షణలో ఉంటాయన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

నిజామాబాద్‌నాగారం: నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల త్వరలో రీ–న్యాక్ గుర్తింపునకు వెళ్తున్న సందర్భంగా 1956 నుంచి 2023 వరకు డిగ్రీ, పీజీ విద్యార్థులు కళాశాలలో శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాంమోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. వివరాలకు 9440791144 సంప్రదించాలన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న నవీన్

సుభాష్‌నగర్: ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ చైర్మన్ మహ్మద్ యాసిన్, రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పూర్తిస్థాయి కార్యవర్గాన్ని శుక్రవారం నగరంలోని కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్ గెంట్యాల శ్రీకాంత్ ద్వారా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. జిల్లా వైస్ చైర్మన్లుగా దర్పస్తు నవీన్, పెంటి బాలరాజ్, ప్రధాన కార్యదర్శులుగా కస్తూరి సురేష్, ఎంబర్ గంగాధర్, కన్వీనర్‌గా దేవల్‌రాజా ప్రదీప్, కో కన్వీనర్‌గా బూస నవీన్, సోషల్ మీడియా కన్వీనర్‌గా కొట్టాల రంజిత్, సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నియమ, నిబంధనలకు అనుగుణంగా పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య



లీలావతి మృతదేహం

వర్ని: తలనొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్ని మండలంలోని శ్రీనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్త లీలావతి(41) కొంత కాలంగా తలనొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు సాయినితిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం



మొగులయ్య(ఫైల్)

వర్ని: చందూర్‌లోని గ్రామపంచాయతీ పక్కన ఉన్న నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కాలువలో పొతంగల్ మండల కేంద్రానికి చెందిన మొగులయ్య(44) మృతదేహాన్ని లభ్యమైనట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. పొతంగల్‌కు చెందిన మొగులయ్య ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కాలువలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన బద్దుల గంగాధర్(48) ఉపాధి నిమిత్తం మస్కట్ దేశం వెళ్లాడు. అక్కడ ఫిట్స్ రావడంతో ఈనెల 24న మృతి చెందాడు. శుక్రవారం మతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. గంగాధర్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

నిషేధిత గుట్కా పట్టివేత

బిచ్కుంద: మండల కేంద్రానికి చెందిన ఓ కిరాణ షాపు నిర్వాహకుడు నిషేధిత గుట్కాను ఆటోలో తరలిస్తుండగా పోలీసులు గురువారం రాత్రి గోపన పల్లి చౌరస్తాలో పటుకున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు ఆటోను తనిఖీ చేయగా రూ. 4 లక్షల గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కర్ణాటక, బౌరాద్ నుంచి రాత్రి సమయాల్లో గుట్కాలను బిచ్కుంద, బాన్సువాడ, నిజామాబాద్‌కు ఆటోల్లో తరలిస్తున్నారు. ఆటో డ్రైవరు, కిరాణ షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

బోధన్‌టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆచన్‌పల్లికి చెందిన లాల్‌అహ్మద్ సైకిల్‌పై బోధన్ వైపు వెళ్తుండగా బస్టాండ్ వద్ద పక్క నుంచి వెళ్తున్న కారును తప్పించబోయి ముందు ఉన్న లారీ వెనక ఉన్న టైర్ కింద పడడంతో కాలికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ వెంకటనారాయణ ఘటన స్థలానికి చేరుకొని వృద్ధుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఇసుక డంప్ సీజ్



రుద్రూర్: పొతంగల్ శివారులో అక్రమంగా నిల్వ చేసిన 60 ట్రిప్పుల ఇసుక డంప్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. ఈ డంప్‌ను శనివారం మధ్యాహ్నం పొతంగల్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ. ఐదు వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

బాకర్‌ఫారం వద్ద..

పొతంగల్ మండలం బాకర్‌ఫారం వద్ద గురువారం అర్ధరాత్రి ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. అనంతరం కోటగిరి పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీజ్ చేసిన టిప్పర్‌కు రూ.50వేల జరిమానా

పొతంగల్‌లో ఇటీవల సీజ్ చేసిన ఇసుక టిప్పర్‌కు మైనింగ్ శాఖ అధికారులు రూ.50వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సోమేశ్వర్‌లో పేలిన సిలిండర్



బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్‌లో శుక్రవారం ఓఇంట్లో ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ పేలింది. గ్రామానికి చెందిన కమలవ్వ తిమ్మప్పలకు చెందిన రేకుల ఇంట్లో సిలిండర్ పేలడంతో వంటసామగ్రి, బియ్యం, దుస్తులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఫైర్‌సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష

ఖలీల్‌వాడి: మద్యం తాగి రోడ్డుపై న్యూసెన్స్ చేసిన ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మూడో పీఎస్ పరిధిలోని దుబ్బకు చెందిన రాచకొండ శ్రీకాంత్, కంఠేశ్వర్‌కు చెందిన డెక్కా రవి కుమార్ మూడో టౌన్ పరిధిలో ఈ నెల 26న రాత్రి 10 గంటల ప్రాంతంలో మద్యం సేవించి న్యూసెన్స్ చేయగా ఇద్దరిపై సిటీ పోలీస్‌యాక్ట్ కింద కేసు నమోదు చేసి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ దగ్గర హాజరుపర్చినట్లు చెప్పారు. దీంతో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన రవితేజ అనే యువకుడిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ శుక్రవారం తెలిపారు. వినాయక నిమజ్జనం సమయంలో రవితేజకు అదే గ్రామానికి చెందిన అఖిలేష్ అనే వ్యక్తి నాన్నతో గొడవ జరిగింది. ఆ గొడవను దృష్టిలో పెట్టుకొని అఖిలేష్ తన స్నేహితులైన కుషాల్, దీపక్, నితిన్‌తో కలిసి రవితేజపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అఖిలేష్ అతని స్నేహితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాసర గోదావరి నదిలో మహిళ గల్లంతు

ధర్మారం(బి) గ్రామంలో విషాదం



గోదావరిలో గల్లంతైన జయ

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన కర్రోళ్ల జయ(35) నిర్మల్ జిల్లా బాసర గోదావరి నదిలో స్నానం చేస్తుండగా నీటి ప్రవాహానికి గల్లంతైంది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయ తల్లి కోటగిరి లక్ష్మి ఇటీవల చనిపోయింది. శుక్రవారం తన తమ్ముడు రవి, అతడి భార్య కృష్ణవేణి వారి పిల్లలతో కలిసి జయ బాసర గోదావరిలో స్నానాలు చేసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం పుష్కర ఘాట్ వద్ద జయ ముందుగా తమ్ముడి పిల్లలకు స్నానాలు చేయించి వారిని ఒడ్డున కూర్చోబెట్టి నదిలోకి దిగింది. అప్పటికే నదిలో తమ్ముడి భార్య కృష్ణవేణి స్నానం చేస్తోంది. ఇద్దరూ కలిసి స్నానాలు చేస్తుంటే రవి ఒడ్డున ఉండి తన మొబైల్‌లో వీడియో చిత్రీకరిస్తున్నాడు. ఇంతలోనే ఒక్కసారిగా జయ, కృష్ణవేణి నీటిలో మునుగుతూ కొట్టుకుపోసాగారు. అది చూసి షాక్‌కు గురైన రవి కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న జాలర్లు వెంటనే ఇద్దరిని కాపాడేందుకు యత్నించారు. కృష్ణవేణిని కాపాడారు కానీ జయ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. జయ కోసం పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. జయ భర్త గతంలోనే మృతి చెందడంతో తల్లి వద్దే ఉంటోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే జయ మృతితో ధర్మారం(బి) గ్రామంలో విషాదం నెలకొంది. బాసర పోలీసులు కేసు నమోదు చేసి జయ మృతదేహం కోసం గాలిస్తున్నారు.

ఆటోలో ప్రయాణికురాలి బంగారం చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్ వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడ నుంచి బంగారు గొలుసును తోటి మహిళలు ఎత్తుకెళ్లినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం వడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్ల భూలక్ష్మి పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లగా స్వగ్రామానికి వచ్చేందుకు నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు ఆటో డ్రైవర్ కంఠేశ్వర్ నుంచి బైపాస్ రోడ్డు ద్వారా గౌతంనగర్ వైపు తీసుకెళ్లారు. గౌతంనగర్ ప్రాంతంలో ఇద్దరు మహిళలు భూలక్ష్మి మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని ఆటో నుంచి నెట్టేశారు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు, ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయారు. బాధితులి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎండు గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: సదాశివనగర్ మండలం వజ్జెపల్లి, యాచారం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఎండు గంజాయిని సరఫరా చేస్తూ పట్టుబడిన ఇద్దరిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ విజయ్ కుమార్ మాట్లాడారు. మొదట వజ్జెపల్లిలోని కామిండ్ల రాజశేఖర్ వద్ద తనిఖీలు చేయగా 70 గ్రాముల గంజాయి లభించిందన్నారు. అతడిని విచారించగా యాచారం తండాకు చెందిన తిరుపతి వద్ద కొనుగోలు చేసినట్లు తెలుపగా తిరుపతి ఇంట్లో సోదాలు చేశామన్నారు. అక్కడ మరో 70 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. మొత్తం 140 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ కుమార్, సిబ్బంది రాజు, ప్రకాశ్, రాధిక, ఆంజనేయులు, దేవకుమార్, రమ, శ్రీరాం పాల్గొన్నారు.